



ప్రధాని మోదీతో సీఎం స్టాలిన్

కేంద్ర పన్నుల్లో సగం వాటా ఇవ్వండి

- నిధుల కోసం పోరాటం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం
- కావేరీ - వైగై నదులను శుద్ధి చేయాలి
- 'నీతి ఆయోగ్' భేటీలో సీఎం స్టాలిన్



నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం స్టాలిన్

చెన్నై, మే 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో రాష్ట్రాలకు సగం (50 శాతం) వాటా ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కోరారు. శనివారం న్యూఢిల్లీ లో 10వ నీతి ఆయోగ్ సమావేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగింది. ఇందులో సీఎం స్టాలిన్ సహా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం వాటా ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఈ పన్నుల వాటా 41 శాతం ఉంటే అమల్లో మాత్రం 33.16 శాతం వస్తుందని గుర్తు చేశారు. ప్రధానంగా రాష్ట్రాలకు తమకు రావాల్సిన నిధులను పొందడానికి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది భారత సమాఖ్య స్ఫూర్తికి ఏమాత్రం మంచిది కాదన్నారు. 2030 నాటికి తమిళనాడు రాష్ట్రం ట్రిలియన్ డాలర్ ఆర్థిక వృద్ధి సాధించాలన్న లక్ష్యంగా పెట్టుకుని కృషి చేస్తున్నామన్నారు. ఆ దిశగానే తమ రాష్ట్ర వృద్ధిరేటు గణాంకాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఇటీవలి సంవత్సరాల్లో వృద్ధిరేటు 8 శాతం ఉందన్నారు. అయితే, గత యేడాది దేశంలోనే అత్యధిక వృద్ధిరేటు (9.69 శాతం) సాధించిన రాష్ట్రంగా నిలిచిందని గుర్తు చేశారు. స్వతంత్ర భారతావనిలో 2047 నాటికి 4.5 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థను సాధించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. భారత్ లక్ష్యంగా పెట్టుకున్న 30 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థతో తమిళనాడు భాగస్వామ్యం అత్యంత కీలకంగా ఉంటుందన్నారు. రాష్ట్రం మొత్తం పారిశ్రామికీకరణగా మారుతోందన్నారు. ఆటోమొబైల్స్ నుంచి హైడ్రోజన్ వరకు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలిచిందన్నారు. పట్టణీకరణలో తమిళనాడు అగ్రస్థానంలో ఉందన్నారు. పెరుగుతున్న నగర, పట్టణ జనాభాకనుగుణంగా మౌలిక సదుపాయాల రూపకల్పన, మెరుగైన జీవన ప్రమాణాలందించేందుకు భారీ నిధులతో కూడిన బృహత్తర ప్రాజెక్టు అవసరమన్నారు. 'అమృత్ 2.0' పథకం ముగింపు దశకు చేరుకుందని అలాంటి ప్రాజెక్టును మరొకదాన్ని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్టాలిన్ సూచించారు. గంగానదిని శుద్ధి చేసేందుకు 'క్లీన్ గంగా' ప్రాజెక్టు అమలు చేస్తున్న విధంగా కావేరీ, వైగై, తామ్రభరణి వంటి నదులను శుద్ధి చేయాలని ఆయన కోరారు. అలాగే, 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను 30 ట్రిలియన్ డాలర్ల శక్తిగా మార్చాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని ప్రశంసిస్తున్నట్టు తెలిపారు. 'పీఎం శ్రీ' పేరుతో రూపొందించిన విద్యా పథకంపై కొన్ని రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సంతకాలు చేయలేదన్నారు. ఈ కారణంగా ఎస్ఎస్ఏ నిధులను విడుదల చేయలేదని, ఇందులోభాగంగా 2024-25 సంవత్సరానికి తమ రాష్ట్రానికి రూ.2,200 కోట్లను విడుదల చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నిధులను నిలిపివేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు, విద్యా హక్కు చట్టం కింద చదువుకునే విద్యార్థులపై ప్రభావం పడుతుందన్నారు. అందువల్ల ఈ నిధులను ఆలస్యం చేయకుండా, బేషరతుగా విడుదల చేయాలని సీఎం స్టాలిన్ కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ వాటా పెంచడం వంటి చర్యల వల్ల రాష్ట్రాల నిధులపై ప్రభావం చూపుతుందన్నారు. ఒక వైపు కేంద్రం రావాల్సిన పన్నుల వాటా తగ్గడం, మరోవైపు కేంద్ర ప్రభుత్వ పథకాల్లో రాష్ట్ర వాటా పెరగడం వంటి చర్యల వల్ల రాష్ట్రాలపై ఆర్థిక భారం పడుతుందని అందువల్ల కేంద్రం ఆదాయంలో రాష్ట్రాల వాటాను 50 శాతం మేర పెంచాలని సీఎం స్టాలిన్ తన ప్రసంగంలో కోరారు.

విద్యానిధులు అందిస్తారనే నమ్మకముంది...! : సీఎం స్టాలిన్

రాష్ట్రానికి రావాల్సిన రూ.2,200 కోట్లు విద్యానిధులు ఇస్తారనే నమ్మకం ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. శనివారం ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నీతి ఆయోగ్ సమావేశంలో రాష్ట్రానికి కావాల్సినవి అడిగినట్టు చెప్పారు. కోవైలో ఎయిమ్స్‌ను నెలకొల్పాలని కోరామన్నారు. కోయంబత్తూరు, మదురైలో మెట్రో ప్రాజెక్టు అంశాన్ని ప్రస్తావించామన్నారు. శ్రీలంక నావికాదళం అరెస్టు చేసే తమిళ జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలను విడిపించడం వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని, చెంగల్పట్టు - దిండివనం జాతీయ రహదారిని ఎనిమిది లేన్లగా మార్చాలని కోరినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో ఈడీ తనిఖీలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు న్యాయమేనన్నారు. ఈడీ చర్యలు కేవలం రాజకీయ ప్రేరేపిత చర్యలన్నారు. అందువల్ల రాజకీయపరంగా ఎదురయ్యే అన్ని సమస్యలను ఎదుర్కొంటామని ఆయన స్పష్టం చశారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీతో సమావేశం కేవలం మర్యాదపూర్వకంగా జరిగిందన్నారు. తన వద్ద శ్వేతవర్ణ పతాకం లేదని, అలాగే, ఎడప్పాడి దగ్గర కాషాయ జెండా లేదని సీఎం స్టాలిన్ అన్నారు.

కేరళ సీఎంకు స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం స్టాలిన్ విడుదల చేసిన ప్రకటనలో..." కేరళ ముఖ్యమంత్రి, నా ప్రియమిత్రుడు పినరయి విజయన్‌కు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. ప్రగతిశీల పాలన పట్ల వారి నిబద్ధ, సమాఖ్యవాదం, లౌకికవాదం పట్ల మన నిబద్ధత తమిళనాడు-కేరళ సంబంధాన్ని బలోపేతం చేస్తాయి. రెండు రాష్ట్రాలు కలసి నిలబడి సాంస్కృతిక సంబంధాలు, ఉమ్మడి లక్ష్యాలను కాపాడుకుందాం... మీకు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, ఆనందం కలగాలని కోరుకుంటున్నాను" అంటూ సీఎం స్టాలిన్ తెలియజేశారు.

హిందూ ధర్మాన్ని వైరస్‌తో పోల్చడం దౌర్భాగ్యం

- గవర్నర్ ఆర్ఎన్ రవి



పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా వైరస్‌తో పోల్చడం దౌర్భాగ్యమని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యాఖ్యానించారు. శివగంగ జిల్లా దేవకోట సమీపం కందాదేవిలో శనివారం జరిగిన సమాజ సామరస్య సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. "ఆంగ్లేయులు అమెరికా, కెనడా దేశాల్లోని దిగువ తరగతుల మధ్య విభజన వ్యవస్థ అమలుచేశారు. భారత దేశం ఆ మార్గాన్ని అనుసరించలేకపోయింది. భారతదేశం పెద్ద దేశమైనప్పటికీ, సమాజం ఐక్యంగానే ఉంది. స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ జాతీయ సైన్యం ఏర్పాటుచేసినప్పుడు, తమిళనాడు నుంచి 5వేలమంది చేరారు. అలాంటి పరిస్థితుల్లో, ఆంగ్లేయులు ఎలా విభజించాలో ఆలోచించారు. వారిని ఏది ఏకం చేస్తుంది అనే ఆలోచనా సమయంలో, దేవాలయాలను వారు గుర్తించారు. ప్రజల జీవితంలోని అన్ని అంశాలకు దేవాలయాలు కేంద్ర బిందువు అని వారు తెలుసుకున్నారు. దేవాలయాలను బలహీనపరచడం ద్వారా సమాజాన్ని బలహీరపరచవచ్చని వారు నిర్ణయించుకున్నారు. దేవాలయాల భూములు, ఆస్తుల ద్వారా ఆదాయం సమకూరుతున్నట్లు గుర్తించారు. దీంతో, వారు కట్టలేని విధంగా పన్నులు పెంచారు. వారు కులాల లోపల కూడా విభజనలను సృష్టించారు. అది సమాజ విభజనకు కారణమైంది. ఆంగ్లేయులు విభజన చర్యలు చేపట్టడంలో ఆశ్చర్యం లేదు, స్వాతంత్ర్యం తర్వాత కూడా పాలకులు ఈ విధంగా వ్యవహరించడం ఆశ్చర్యకరం. దురదృష్టవశాత్తు హిందూ మతం, భక్తిని డెంగ్యూ, మలేరియా, ఇతర వ్యాధులతో పోల్చడం చూస్తున్నాము. ఈ పుణ్యభూమిలో శాస్త్రీయ భక్తి స్ఫూర్తిని వ్యాపింప జేసిన నాయన్మార్లు, ఆళ్వార్ల హేతుబద్ధమైన ఆలోచన లేకుండా ఉన్నారా? ఈ చర్యలు ఎందుకు జరుగుతున్నాయి? ఎందుకంటే దేవాలయాలు స్తంభింపజేయాలి, భక్తులు దేవాలయాలకు వెళ్లడం మానుకోవాలి. దేవాలయాలకు వెళ్లి వారి సంప్రదాయాలను పూజించాలనే ఆలోచన వారు మరచిపోవాలి. అలా దేవాలయాలు స్తంభింపజేయాలనే అంచనాలు, పరిస్థితులను అలాంటి వ్యక్తులు ఆశిస్తున్నారని" గవర్నర్ వ్యాఖ్యానించారు.



నీలగిరి, కోవై జిల్లాలకు అతి భారీ వర్ష సూచన

- 9 ఓడరేవుల్లో తుపాను సూచిక
- ఐఎండీ హెచ్చరికలు

ప్యారీస్, మే 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో నీలగిరి, కోవై జిల్లాల్లో అతి భారీవర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో ముందుగానే నైరుతి రుతుపవనాల ఆగమనం, బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతున్న క్రమంలో శనివారం నుండి ఈ నెల 28వ తేదీ వరకు రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీనుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని నుంగంబాక్కంలోని దక్షిణ మండల వాతావరణ పరిశోధనా కేంద్రం చైర్మెన్ అముద శనివారం మీడియాకు వివరించారు. రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణం కంటే గత మార్చి నుండి ఇప్పటి వరకు 92 శాతం అధిక వర్షం కురిసిందని, రాష్ట్రంలో 15 సెంటీమీటర్ల వర్షం కురవాల్సివుండగా, ఈ ఏడాది 28 సెంటీమీటర్ల వర్షం కురిసిందన్నారు. కోస్తా జిల్లాలు, పర్వతశ్రేణులు అధికంగావున్న జిల్లాల్లో భారీవర్షాలతో పాటు పిడుగులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని ఆమె తెలిపారు.

ముందుగానే నైరుతి...

నైరుతి రుతుపవనాలు శనివారం పొరుగునేవున్న కేరళ రాష్ట్రాన్ని తాకాయని అలాగే రాష్ట్రంలోకి ఒకటి, రెండు రోజుల్లో ప్రవేశించే అవకాశముందని అముద తెలిపారు. గడిచిన 25 ఏళ్లలో 2019 మే 23న ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రారంభమైనట్లు ఆమె గుర్తుచేశారు. రుతు పవనాల ఆగమనంతో అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, లక్షదీవులు, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయని తెలిపారు. రానున్న 24 గంటల్లో నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల పశ్చిమ కనుమల సరిహద్దు జిల్లాల్లో శనివారం నుండి వచ్చే 28వ తేదీ వరకు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా 26. 27 తేదీల్లో ఈరోడ్, తిరుప్పూర్, తేని, సేలం, రామనాథపురం, ధర్మపురి, తిరునల్వేలి, దిండుగల్, తేని, కన్నియాకుమారి, తిరుప్పూర్, విరుదునగర్, తెన్‌కాశి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు.

రెండు జిల్లాలకు రెడ్ అలర్ట్...

పర్వతశ్రేణులు అధికంగావున్న నీలగిరి, కోవై జిల్లాల్లో ఆదివారం నుండి బుధవారం వరకు భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఈ జిల్లాల ప్రజలను అప్రమత్తం చేస్తూ రెడ్ అలర్ట్ జారీ చేశారు. నీలగిరి జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ముందే చేరిన పర్యాటకులను అప్రమత్తం చేస్తూ జిల్లా యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. ఇక్కడున్న పైన్ ఫారెస్ట్, దొడ్డబెట్ట శిఖరంపైకి వెళ్లేందుకు స్టే విధించారు. వరద ముంపునకు గురైయ్యే ప్రాంతాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయ చర్యలు చేపట్టేందుకు మోహరించాయి. అదేవిధంగా ఊటీ నుండి కోవై జిల్లా సరిహద్దుల వరకువున్న ఘాట్ రోడ్డులో ఆదివారం వాహనాల రాకపోకలను నిషేధించింది. కేంద్ర పాలిత రాష్ట్ర పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. నీలగిరి జిల్లా ఆవలాంచి, బందలూరులో తలా 11 సెంటిమీటర్లు, కల్లార్‌లో 9 సెంటిమీటర్లు, స్థానిక మడిపాక్కం, మేళవాక్కం, నుంగంబాక్కం, మీనంబాక్కంలో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ప్రకటించారు.

జాలర్లకు హెచ్చరిక...

శనివారం నుండి వచ్చే బుధవారం వరకు దక్షిణ తమిళనాడు సముద్రతీరాల్లో గంటకు 45 నుండి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వేచే అవకాశముందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. అందువల్ల కన్నియాకుమారి, పుదుకోట, నాగపట్నం, రామనాథపురం తదితర సముద్రతీర జిల్లాలకు చెందిన జాలర్లు మరలా ఉత్తర్వులు వచ్చే వరకు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. తూత్తుకుడి, రామనాథపురం జిల్లా పాంబన్ ఓడరేవుల్లో 3వ నెంబర్ హెచ్చరికను, నాగపట్నం, కన్నియాకుమారి, చెన్నై పోర్ట్, కామరాజర్ పోర్ట్, కారైక్కాల్ పోర్ట్ ఓడరేవుల్లో 1వ నెంబర్ తుఫాను హెచ్చరిక జారీచేశారు. కాగా, రాజధాని నగరంలో వాతావరణంలో చెప్పుకోదగ్గ మార్పులుండవని నగరంలోని పలు ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది.



కోవైలో వర్షం దృశ్యాలు



లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి ఉదయనిధి

ఈడీకి - మోదీకి భయపడేది లేదు

- ఉపముఖ్యమంత్రి ఉదయనిధి

ప్యారీస్, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీకి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి డీఎంకే ఎప్పటికీ భయపడదని, ఎన్ని సమస్యలు ఎదురైనా చట్టపరంగా ఎదుర్కొంటామని ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్పష్టం చేశారు. శనివారం ఉదయం పుదుకోట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై పలు శాఖల అధికారులతో ఉపముఖ్యమంత్రి సమీక్షించారు. ప్రజల నుండి స్వీకరించే వినతులపై సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, సమస్యలు తెలిపేందుకు కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ, డీఎంకే ఎవరికీ బానిస కాదని, రాష్ట్ర హక్కులను పోరాడి సాధించుకుంటున్నామని, అవినీతికి పాల్పడే వారే భయపడుతుంటారన్నారు. రాష్ట్ర పథకాలకు సంబంధించి పెండింగులోవున్న నిధులను పొందడం కోసం మాత్రమే ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొన్నారని, దీనిని ప్రతిపక్షాలు విమర్శించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమం ముందుగా రూ.40 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలను 1,177 మంది లబ్దిదారులకు ఉప ముఖ్యమంత్రి అందజేశారు. అలాగే 125 మంది గిరిజనులకు ఇళ్ల పట్టాలు, కలైంజర్ కనవ్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించుకునేందుకు ఉత్తర్వులు జారీచేశారు.సంక్షేమ సహాయాలు అందుకున్న గిరిజనులు కృతజ్ఞత తెలుపుతూ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు ఎస్.రఘుపతి, కేఆర్ పెరియకరుప్పన్,అన్బిల్ మహేష్, మెయ్యనాథన్, ఎంపీలు అబ్దుల్లా, దురై వైగో, జ్యోతిమ ణి, ఎమ్మెల్యేలు ముత్తురాజా, చిన్నదురై, రామచంద్రన్, జిల్లా కలెక్టర్ అరుణ, పుదుకోట కార్పొరేషన్ మేయర్ తిలకవతి సెంథిల్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పన్ను పెంపు ఉపసంహరించుకోవాలి

- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ డిమాండ్



ప్యారీస్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పంచాయతీల్లో పెంచిన ఇంటి పన్ను, నీటి పన్ను సత్వరం ఉపసంహరించుకోవాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేశారు. ఆయన శనివారం మీడియాత మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 నెలల్లో పట్టణ పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ ప్రాంతాల్లోవున్న ఇళ్లు, దుకాణాలకు రెండుసార్లకు పైగా పన్ను పెంచిందని, ఇక నుండి ప్రతి ఏటా 6శాతం వరకు పన్ను పెంచనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడాన్ని ఈపీఎస్ తప్పుబట్టారు. 2021 మేలో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం ఆస్తి పన్నులతో పాటు తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ ఛార్జీలను 6 శాతం వరకు పెంచిందని, మరోవైపు బియ్యం, పప్పు ధాన్యం, వంట నూనె ధరలు పెరగడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక సమస్యలతో తల్లడిల్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే రుణాలు పొందడంతో తమిళనాడు ప్రథమ స్థానంలో ఉందని, ఈ డీఎంకే మోడల్ ప్రభుత్వ చేతకానితనం వల్ల రాష్ట్రప్రజలు సమస్యల వలయంలో చిక్కుకుని బాధలు అనుభవిస్తున్నారని ఆయన విమర్శించారు. ఎంజీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేద,మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గుడిసె ఇళ్లకు ఉచిత కరెంట్ పంపిణీ చేస్తే, ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం పేదప్రజలకు నష్టం కలిగే విధంగా పన్నులు పెంచుతోందని ఈపీఎస్ విమర్శించారు.

సమాచార దృశ్ని

పాలిటెక్నిక్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో అడ్మిషన్ల గడువును సాంకేతిక విద్య డైరెక్టరేట్ పొడిగించింది. రాష్ట్రంలోని 55 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 2025-26వ విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఈ నెల 8వ తేది ప్రారంభమైంది. ఈ ఏడాది పాలిటెక్నిక్ కళాశాలల్లో మరో ఐదు కొత్త కోర్సులు పరిచయం చేశారు. దరఖాస్తు స్వీకరణ గడువు ఈ నెల 23వ తేదీతో ముగిసిన నేపథ్యంలో, గడువు పొడిగించారు. చివరి తేదిపై తర్వాత అధికారికంగా ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. విద్యార్థులు www.tnpoly.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రభుత్వ కళాశాలలకు దరఖాస్తుల వెల్లువ

అడయార్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కాలేజీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు భారీగా వస్తున్నాయి. కొత్త విద్యా సంవత్సరం 202-26లో ఈ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 176 ప్రభుత్వ ఆర్ట్స్,సైన్స్ కాలేజీలున్నాయి. ఈ కాలేజీల్లోని వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. అన్ని కాలేజీల్లో 1.25 లక్షల పైచిలుకు సీట్లుండగా ఇప్పటివరకు రెండు లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం ఒక్కరోజే ఏకంగా 98,263 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈ నెల 27వ తేదీతో ముగియనుంది. "www.tngasa.in' అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్తి వివరాల కోసం 044-22434 3106, 2434 2911 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

రేపటి నుంచి భవానీసాగర్ నీటి విడుదల

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): భవానీసాగర్ డ్యాం నుంచి సోమవారం నుంచి సెప్టెంబరు 22వ తేది వరకు సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ జలవనరుల శాఖ కార్యదర్శి విడుదల చేసిన ప్రకటనలో... 2025-26వ సంవత్సరం మొదటి ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేయనున్నామన్నారు. దీని వలన ఈరోడ్ జిల్లాల్లోని గోపిచెట్టిపాళయం, అందియూర్, భవానీ తాలూకాల్లోని 24,504 ఎకరాలకు లబ్దిచేకూరుతుందని ప్రభుత్వం తెలిపింది.

28 నుంచి రోప్‌కార్ సేవల నిలిపివేత

తిరుత్తణి, మే 24 (ఆంధ్రజ్యోతి): షోలింగర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళ్లేందుకు ఏర్పాటుచేసిన రోప్‌కార్ సేవలు ఈ నెల 28,29తేదీల్లో నిలిపివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ కొండ ఆలయానికి వృద్ధులు, పిల్లలు, గర్భిణులు వెళ్లేలా రోప్‌కార్ సేవలు పరిచయం చేశారు. నెలవారీ మరమ్మతుల్లో భాగంగా 28,29 తేదీల్లో రోప్‌కార్ సేవలు నిలిపివేస్తున్నామని, ఆ రోజుల్లో వృద్ధులు, పిల్లలను దర్శనానికి తేవొద్దని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

'నాన్ ముదల్వన్' పథకం ద్వారా 41 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): 'నాన్ ముదల్వన్' పథకం ప్రారంభించిన మూడేళ్లలో ఇప్పటివరకు 41 లక్షల మంది విద్యార్థులు లబ్ది పొందినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. ఈ పథకంలో ప్రస్తుత సంవత్సరం కేంద్ర ప్రభుత్వ పరీక్షల్లో 58 మంది ఉత్తీర్ణులయ్యారని, సివిల్స్‌లో 50 మంది, ఐఎఫ్ఎస్ పరీక్షల్లో 10 మంది ఉత్తీర్ణులయ్యారని సచివాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది.

మీనంబాక్కం నుంచి వెళ్లాల్సిన ఐదు విమానాల రద్దు

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి బయల్దేరాల్సిన రెండు విమానాలు, రావాల్సిన మూడు విమానాలు రద్దయ్యాయి. నగరం నుంచి తూత్తుకుడికి ఉదయం 6, మధ్యాహ్నం 2.30 గంటలకు వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానాలు, పూనే నుంచి తెల్లవారుజామున 4.25 గంటలు, తూత్తుకుడి నుంచి మధ్యాహ్నం 1.45, సాయంత్రం 6.30 గంటలకు నగరానికి రావాల్సిన స్పైస్ జెట్ విమానాలు రద్దయ్యాయి. ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండడం, నిర్వహణ కారణాలతో విమానాలు రద్దయ్యాయి. కానీ, ఈ విషయం ముందుగానే తెలుపకపోవడంతో ఆ విమానాల్లో రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

వెటర్నరీ కోర్సుల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 53 సీట్లు

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ వచ్చేవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్లస్ టూ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నారు. తమిళనాడు వెటర్నరీ వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చెన్నై, నామక్కల్, తిరునల్వేలి, ఒరత్తనాడు, సేలం తలైవాసల్, ఉడుమలైపేట, తేని వీరపాండి తదితర ప్రాంతాల్లో వెటర్నరీ వైద్య కళాశాలలున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 7.5 శాతం రిజర్వేషన్ కింద 53 సీట్లు కేటాయించినట్లు వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

29న తపాలా బీమా ఏజెంట్ల ఇంటర్వ్యూ

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ చెన్నై కేంద్ర డివిజన్ కార్యాలయంలో జీవిత బీమా ఏజెంట్ల పోస్టులకు ఇంటర్వ్యూ ఈ నెల 29వ తేది జరుగనుంది. ఈ మేరకు తపాలా శాఖ విడుదల చేసిన ప్రకటనలో. టి.నగర్ శివజ్ఞానం రోడ్డులోని చెన్నై కేంద్ర డివిజన్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ జరుగనుంది. ఎస్ఎస్ఎల్‌సీ ఉత్తీర్ణులై 18 నుంచి 50 ఏళ్లలోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. యువకులు, బీమా ఏజెంట్లు, మాజీ సైనికులు, అంగన్వాడీ ఉద్యోగులు, పాలసీలు చేయించడంలో అనుభవం ఉన్న వారు స్వీయ వివరాలు, విద్య, అనుభవం తదితరాలు ఒరిజినల్, నకళ్లతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని తపాలా శాఖ తెలిపింది.

చెరకు బకాయిలకు రూ.97 కోట్ల విడుదల

ప్యారీస్, మే 24 (ఆంధ్రజ్యోతి): చక్కెర ఫ్యాక్టరీలకు చెరకు సరఫరా చేసిన రైతులకు బకాయి ఉంచిన నిధులు పంపిణీ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.97.77 కోట్లు విడుదల చేసింది. సహకార చక్కెర కర్మాగారాల్లో సభ్యులుగావున్న రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ నిధులను త్వరలోనే జమచేయనున్నట్లు, పర్యాటక, పరిశ్రమలశాఖ మంత్రి ఆర్ రాజేంద్రన్ శనివారం ప్రకటించారు. సహకార చక్కెర కర్మాగారాలకు చెరకు సరఫరా చేస్తున్న రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తోందని మంత్రి వివరించారు.

నేడు రంగనాథస్వామి ఆలయంలో బాలాలయం

● అంకురార్పణ పూజలు ప్రారంభం

ప్యారీస్, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట ముల్లావీధిలో రంగనాయకి సమేత రంగనాథస్వామి ఆలయంలో పరివార మూర్తులకు బాలాలయం, నూతన రాజగోపుర నిర్మాణం పనులు ఆదివారం ప్రారంభం కానున్న సందర్భంగా శనివారం అంకురార్పణం, మహాశాంతి పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో మూలవర్లకు అర్చన, అభిషేకాలను అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. అనంతరం రంగనాయకి సమేత రంగనాథస్వామివార్లను అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జె.హరికుమార్, అధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం స్వామివార్లకు, పరివార మూర్తులకు బాలాలయం, నూతన రాజగోపురం జీర్ణోద్ధరణ పనులు ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



అంకురార్పణ పూజల్లో ఆలయ ఛైర్మన్ జె.హరికుమార్ తదితరులు

మరుదమలైలో 184 అడుగుల మురుగన్ విగ్రహం

● నిపుణుల కమిటీ ఏర్పాటు

టి.నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం మరుదమలై ఆలయం వద్ద 184 అడుగుల ఎత్తు మురుగన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించే ప్రాథమిక స్థాయి పనుల్లో భాగంగా నిపుణుల కమిటీ ఏర్పాటైంది. ఈ విగ్రహం ఏర్పాటు కోసం రాష్ట్ర దేవాదాయ శాఖ రూ.110 కోట్లు కూడా కేటాయించింది. ఈ భారీ మురుగన్ విగ్రహం ఏర్పాటుకుగాను ఆ నిపుణుల కమిటీ భూసార పరీక్షలు చేయనుంది. ఆ తర్వాత విగ్రహం తయారీ పనులు ప్రారంభం కానున్నాయి. మొదట టెండర్లు జారీ చేసి, వచ్చే జూలైలో విగ్రహ ప్రతిష్ఠ పనులను ప్రారంభించనున్నామని దేవాదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

టీవీకేలోకి ఐఆర్ఎస్ అధికారి అరుణ్‌రాజ్?



టి.నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రికళగం (టీవీకే)కు ఇప్పటిదాకా అనధికారికి రాజకీయ సలహాదారుగా పనిచేసిన ఆదాయపు పన్నుల శాఖ అదనపు కమిషనర్ అరుణ్‌రాజ్ ఆ పార్టీలో చేరటానికి రంగం సిద్ధమైంది. వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో గెలిచేందుకు టీవీకే వ్యూహరచన చేయడంలో తలమునకలవుతోంది. ఆ పార్టీకి ఇప్పటివరకూ రాజకీయ సలహాదారుగా అనధికారికంగా పనిచేసిన అరుణ్‌రాజ్ తన పదవికి రాజీనామా చేశారు. కేంద్ర ఆర్థికమంత్రిత్వశాఖ ఆ రాజీనామా ఆమోదించింది. టీవీకే కోసం ప్రభుత్వ పదవిని సైతం వదలుకున్న అరుణ్‌రాజ్‌కు పార్టీలో కీలకమైన పదవి కట్టబెట్టాలని పార్టీ అధినేత విజయ్ భావిస్తున్నారు. ఆ మేరకు అరుణ్‌రాజ్‌కు సంయుక్త ప్రధాన కార్యదర్శి లేదా డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా నియమించాలని ఆయన భావిస్తున్నారు.


ఆంగ్ల పదాలకు తమిళ పదాల ఆవిష్కరణ

అడయార్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటింగ్, డిస్క్ బ్రేక్ వంటి ఆంగ్ల పదాలకు స్వచ్ఛమైన తమిళ పదాలను తమిళ భాషాభివృద్ధి సంస్థ తాజాగా ఆవిష్కరించింది. ఆ సంస్థ ఛైర్మన్ డి.రాజేంద్రన్ సారథ్యంలో జరిగిన తమిళ భాషాభివృద్ధి సదస్సులో ప్రొఫెసర్లు వి.జయదేవన్, సా.శరవణన్, ఎం.ముత్తువేల్, ఎం.రామస్వామి, భారతిబాలన్, అరుళ్‌వొళి తదితరులు పాల్గొన్నారు. వీరంతా కలిసి ఈ సదస్సులో అనేక ఇంగ్లీష్ పదాలకు తమిళ పదాలను ఆవిష్కరించి, ఉపయోగంలోకి తెచ్చారు. ఆ ప్రకారంగా ఏఐ అనే ఆంగ్ల పదానికి 'సెయ్యరివు' అనే తమిళ పదాన్ని ఇక నుంచి ఉపయోగించాలని నిర్ణయించారు. అలాగే, బ్లూటూత్‌కు 'ఊడలై', బ్రేకింగ్ న్యూస్ అనే పదానికి 'ఆదిర్చి సెయిది', బుల్లెట్ రైలుకు 'మిన్నల్ వేగ రయిల్', డేటింగ్‌కు 'కాదలుణర్ కాలమ్', డిస్క్ బ్రేక్‌కు 'వట్టుతడై', మాల్‌వేర్‌కు 'కెడుపొరుల్' అనే తమిళ పదాలను ఆవిష్కరించారు.

కోత్తగిరి సమీపంలో నల్ల చిరుత సంచారం

టి.నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కోత్తగిరి కామరాజర్ సదుక్కమ్ నుండి అరవేణుకు వెళ్లే రహదారిలో పెరియార్‌నగర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి నల్ల చిరుత సంచరించడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆ గ్రామంలో 50కి పైగా ఇళ్ళల్లో ప్రజలు నివసిస్తున్నారు. తరచూ ఆ గ్రామంలో చిరుతపులులు, ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయి. తాజాగా నల్ల చిరుత ఆ గ్రామంలో సంచరించి సమీపంలో ఉన్న తేయాకు తోటలో చొరబడింది. మరుసటి రోజు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో నమోదైన ఈ దృశ్యాలను చూసి స్థానికులు భయంతో అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ చిరుతపులిని నిర్బంధించేందుకు తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసుల రక్తదానం



రక్తదానం చేస్తున్న పోలీసులు

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.అరుణ్ సూచన మేరకు ప్రధాన కార్యాలయ అడిషినల్ కమిషనర్ విజయేంద్ర పర్యవేక్షణలో సెయింట్ థామస్ మౌంట్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్-2 క్యాంపస్‌లో శనివారం శిబిరం నిర్వహించారు. రాజీవ్ గాంధీ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 16 మంది మహిళా పోలీసులు, 110 మంది పోలీసులు, నలుగురు పోలీసు కుటుంబాల సభ్యులు రక్తదానం చేశారు.

రాష్ట్రాభివృద్ధి కోసమే సీఎం ఢిల్లీ పర్యటన

● మంత్రి కేఎన్ నెహ్రూ

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్నారని మంత్రి కేఎన్ నెహ్రూ వ్యాఖ్యానించారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంభిస్తుందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, బకాయిలు పొందడం కోసమే సీఎం ఢిల్లీ వెళ్లారన్నారు. అన్నాడీఎంకేలా చేతులు కట్టుకుని కేంద ప్రభుత్వాన్ని అర్థించాల్సిన పరిస్థితి ద్రావిడ మోడల్ ప్రభుత్వానికి లేదన్నారు. ఆస్తి, పన్ను పెంపు నిర్ణయం అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఆమోదం తెలిపారని, ప్రస్తుతం వారు పన్ను పెంపుపై ప్రశ్నించే అర్హత కోల్పోయారని మంత్రి వ్యాఖ్యానించారు.

ఘనంగా 'అఖండ సంగీత ధ్యాన యజ్ఞం'



సంగీత విభావరి కళాకారులతో మెడిటేషన్ కోచ్ బాలాజీ దొంతి

ప్యారీస్, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ధ్యానం, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించాలనే సంకల్పంతో ధ్యాన గురువు బ్రహ్మశ్రీ పత్రీజీ ఆశీస్సులతో సత్యం పిరమిడ్ స్పిర్చువల్ ఫౌండేషన్ (ఎస్‌పీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో 'అఖండ సంగీత ధ్యానయజ్ఞం' శనివారం ఘనంగా జరిగింది. చెంగల్పట్టులోని ఇంద్ర నారాయణ మహల్‌లో మెడిటేషన్ కోచ్ బాలాజీ దొంతి ఆధ్యక్షతన ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం వరకు మృదంగం, మాండోలిన్, ఘటం, ఫ్లూట్ సంగీతంతో 3 గంటలపాటు సాగిన ఈ యజ్ఞంలో సుమారు 120 మందికి పైగా పాల్గొని ధ్యానం చేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ, ప్రతిరోజు ధ్యానం, యోగాసనాలు వేయడం ద్వారా ఆరోగ్యాన్ని, మనశ్శాంతి పొందవచ్చని తెలిపారు. ధ్యానం ద్వారా దివ్యమైన జీవితాన్ని ఎలా పొందాలనే అంశాలతో రచించిన పుస్తకాన్ని బాలాజీ ఆవిష్కరించి అందరికీ పంపిణీ చేశారు.

పగిలిన పైపులైన్ ఎగసిపడిన వాటర్

● అన్నూరులో స్తంభించిన ట్రాఫిక్



పైపులైన్ పగలటంతో ఎగసిపడుతున్న జలాలు

టి.నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం మున్సిపాలిటీ పరిధిలో అన్నూరు రోడ్డులో తాగునీటి పథకం భారీ పైప్ లైన్ పగిలిపోవటంతో 50 అడుగుల ఎత్తులో నీరు ఫౌంటెన్‌లా ఎగసిపడ్డాయి. మేట్టుపాళయంలోని భవానీ నది నుంచి కోయంబత్తూరు, తిరుప్పూరు జిల్లాలకు సమగ్ర మంచినీటి పథకం ద్వారా భారీ పైప్‌లైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఆ మేరకు మేట్టుపాళయం మున్సిపాలిటీ పరిధిలోని అన్నూరు రోడ్డులో నడూరు మీదుగా డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ వెళ్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం నడూరు ప్రాంతంలోని పైప్‌లైన్‌లో పగుళ్లు ఏర్పడ్డాయి. దీనితో సుమారు 50 అడుగుల ఎత్తున జలాలు ఎగసిపడ్డాయి. నీరంతా ఫౌంటెన్‌లా చిమ్మటంతో ఆ మార్గంలో రాకపోకలు సైతం స్తంభించాయి. సమాచారం అందుకున్న రాష్ట్ర నీటి సరఫరా సంస్థ ఇంజనీరింగ్ నిపుణులు, మున్సిపల్ ఇంజనీర్లు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని మరమ్మతు పనులు ప్రారంభించారు. ఆ పనులు ముగియడానికి సుమారు రెండు గంటలు పట్టింది. ఆ తర్వాత వాహనాల రాకపోకలు యధావిధిగా ప్రారంభమయ్యాయి.

5 శాతం మేర తగ్గనున్న నోటు పుస్తకాల ధర

అడయార్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నోటుపుస్తకాలు, అచ్చు పుస్తకాల ధరలు ఐదు శాతం మేరకు తగ్గనున్నాయని శివకాశి పుస్తక కంపెనీల యజమానులు వెల్లడించారు. శివకాశి ప్రాంతంలో సుమారుగా 800కి పైగా ప్రింటింగ్ ప్రెస్‌లున్నాయి. వీటిలో వందకు పైగా ప్రెస్‌ల్లో నోటు పుస్తకాలు, అచ్చు పుస్తకాల తయారవుతుంటాయి. 20 పేజీల నుంచి 320 పేజీలతో కూడిన నోటు పుస్తకాలను ఇక్కడ తయారు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో మరో రెండు వారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభంకానున్నాయి. దీంతో పుస్తకాలు తయారీ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నోటు పుస్తకాలను కేవలం మన రాష్ట్రంలోనేకాకుండా, పొరుగు రాష్ట్రాలైన కేరళ, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత నాలుగు నెలలుగా 70 శాతం నోటు పుస్తక ఆర్డర్లను పూర్తి చేశామని, మరో 30 శాతం పుస్తకాలు తయారవుతున్నాయని కంపెనీల యజమానులు వెల్లడించారు. గత యేడాది తరహాలోనే విద్యుత్, కాగితం వంటివి పుష్కలంగా లభ్యంకావడంతో నోటు పుస్తకాల తయారీలో ఎలాంటి ఆటంకాలు కలగలేదని వారు పేర్కొన్నారు. అలాగే, నోటు పుస్తకాల ధరలు కూడా గత యేడాది కంటే ఈ యేడాది 5 శాతం మేరకు తగ్గుతుందని వారు అభిప్రాయపడ్డారు.

కేంద్రంతో సఖ్యతగా ఉంటూ నిధులు పొందాలి : నయినార్ నాగేంద్రన్

అడయార్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సఖ్యతగా ఉంటూ నిధులు పొంది ప్రజలకు మేలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ హితవు పలికారు. ఆయన శనివారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ, గత యేడాది జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొనక పోవడం విచారించదగిన విషయమన్నారు. ఇపుడు ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో ఆయన హాజరుకావడం శుభపరిణామన్నారు. కేంద్రంతో రాష్ట్రం సఖ్యతగా ఉంటూ రావాల్సిన నిధులు పొంది, ప్రజలకు మేలు చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యా నిధులు విడుదల చేసేలా ఆదేశించాలి : వైగో

అడయార్, మే 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తక్షణం విడుదల చేసేలా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయాలని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో కోరారు. ఇదే విషయంపై ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన జాతీయ విద్యా విధానానికి ఆమోదించని రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం పగబట్టిందని, అందుకే రాష్ట్రానికి రావాల్సిన నిధులను విడుదల చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఈ నిధులను పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయపోరాటానికి దిగిందన్నారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపి రాష్ట్రానికి రావాల్సిన విద్యా నిధులను తక్షణం విడుదల చేసేలా ఆదేశించాలని ఆయన కోరారు.

ముస్లిం రిజర్వేషన్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

● మనిదనేయ మక్కల్ కట్చి తీర్మానం

అడయార్, మే 24 (ఆంధ్రజ్యోతి): ముస్లిం రిజర్వేషన్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలని మనిదనేయ మక్కల్ కట్చి డిమాండ్ చేసింది. ఆ పార్టీ కార్యవర్గ సమావేశం శనివారం ఈరోడ్‌లో పార్టీ అధ్యక్షుడు ఎంహెచ్ జవాహిరుల్లా అధ్యక్షతన జరిగింది. ఇందులో పార్టీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమద్, కోశాధికారి కోవై ఉమర్‌తో సహా పార్టీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఈ చట్టాన్ని వ్యతిరేకించిన పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. 2007 నుంచి రాష్ట్రంలో ముస్లిం సామాజిక వర్గానికి అమలు చేస్తున్న 3.5 శాతం రిజర్వేషన్ల ద్వారా లబ్ధి పొందిన అంశంపై ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఈ సమావేశంలో తీర్మానించారు.

ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి : అన్బుమణి డిమాండ్

అడయార్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 13 జిల్లాల్లో కొత్తగా 20 ఇసుక క్వారీలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నిర్ణయాన్ని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి తీవ్రంగా ఖండించారు. ఈ ఇసుక క్వారీలకు ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రకృతి వనరుల నిలువు దోపిడీ యధేచ్ఛగా సాగుతుందన్నారు. పర్యావరణాన్ని, ప్రకృతి వనరులను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ఈ తరహా చర్యలకు పాల్పడటం శోచనీయమన్నారు.

ఎస్ఈటీసీకి మరో 23 ఏసీ బస్సులు

అడయార్, మే 24 (ఆంధ్రజ్యోతి): స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ)కోసం మరో 23 ఏసీ బస్సులను కొనుగోలు చేశారు. ఈ విషయంపై ఎస్ఈటీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.మోహన్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వ ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజా రవాణా కోసం కొత్తగా కొనుగోలు చేసిన 214 బస్సులను గత నెల 4వ తేదీ ఐల్యాండ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారన్నారు. వీటిలో ఎస్ఈటీసీకి 27 బస్సులు కేటాయించారు. అయితే, రాష్ట్ర రవాణా శాఖామంత్రి పి.శివశంకర్ ఆదేశాల మేరకు ఎస్ఈటీసీకి మరో 23 ఏసీ బస్సులను కేటాయించడం జరిగింది. ఈ బస్సులు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. వీటిని తిరుచ్చి - తిరుపతికి 2, చెన్నై కిలాంబాక్కం - బెంగళూరుకు 4, కోయంబేడు - బెంగళూరుకు, చెన్నై కిలాంబాక్కం - తిరుచ్చెందూరు, తిరువాన్మియూరు - తిరుచ్చెందూరు, మన్నార్‌కుడి - చెన్నై, కారైక్కుడి - చెన్నై, ఈరోడ్ - చెన్నై, మదురై - చెన్నై, నెల్లై - చెన్నై ప్రాంతాలకు రెండేసి, చెన్నై - తిరుచ్చికి ఒక బస్సు సర్వీసులను నడుపుతున్నట్టు పేర్కొన్నారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో జమాబందీ కార్యక్రమం

వేలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి సారథ్యంలో శనివారం ఉదయం 2025వ సంవత్సరానికి సంబంధించిన జమాబంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేన్‌వాక్కం, కోనవట్టమ్, మళ్లీశ్వరం, సైదాపేట తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. 1,434వ జమాబంది కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు కలెక్టర్ సుబ్బులక్ష్మికి విన్నవించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేలు, రూరల్ అభివృద్ధి డైరెక్టర్ సెంథిల్‌కుమార్, ఉప తాహసీల్దార్ బాలకుమరన్ పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముత్తుమండపంలో కొత్త బస్టాండు



బస్టాండ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కార్తికేయన్ తదితరులు

వేలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని ముత్తుమండపంలో రూ.10 లక్షలతో నిర్మించిన బస్టాండ్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. శనివారం ఉదయం వేలూరు కార్పొరేషన్ మేయర్ సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కార్తికేయన్ హాజరై రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వేలూరు కార్పొరేషన్ కమిషనర్ జానకి, మండల అధ్యక్షుడు వెంకటేశన్, కౌన్సిలర్లు కాంచన, మురుగన్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వేలూరు వీఐటీ యూనివర్సిటీ ఆడిటోరియంలో ప్రశంసా కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించారు. ఇందులో వేలూరు కలెక్టర్ సుబ్బులక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి దయాలన్ ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, విద్యాశాఖ అధికారి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్

వేలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 10 కిలోల గంజాయిని శుక్రవారం వేలూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి వేలూరు రైల్వేస్టేషన్ సమీపంలో డ్యూటీలో ఉన్న పోలీసులు అటువైపు వేగంగా వస్తున్న ఓ కారు ఆపి తనిఖీ చేయగా అందులో 10 కిలోల గంజాయి గుర్తించారు. బాబు (48), అహ్మద్ (41) అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వేలూరు నుండి పలు ప్రాంతాలకు గంజాయి తరలించి కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు వేలూరు కోర్టు ఆదేశాల మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు.

ఎంటీసీ బస్సు అద్దాల ధ్వంసం: ఇద్దరి అరెస్ట్

అడయార్, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) బస్సు అద్దాలు పగులగొట్టిన వ్యవహారంలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేకే నగర్ డిపోకు చెందిన డ్రైవర్ సెల్వఅరసన్ నడుపుతున్న బస్సు ఈ నెల 17వ తేది అన్నాసాలై మత్తయ్య చర్చి బస్టాండ్‌లో ఆగింది. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు సోడా బాటిల్ వేయడంతో బస్సు వెనుక వైపున్న అద్దాలు ధ్వంసమయ్యాయి. డ్రైవర్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన కేకే నగర్ పోలీసులు, వడపళని భక్తవత్సలం వీధికి చెందిన సంజయ్, వడపళని నార్త్ వీధికి చెందిన మహమ్మద్ ఆసిక్ అమీర్‌లను అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరచి, న్యాయమూర్తి ఉత్తర్వులతో జైలుకు తరలించినట్లు నగర పోలీసు శాఖ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

నిబంధనలు అతిక్రమించే షేర్ ఆటోల స్వాధీనం

● హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు

ప్యారీస్, మే 24 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే షేర్ ఆటోలను స్వాధీనం చేసుకోవల్సిందిగా రాష్ట్ర ట్రాఫిక్ విభాగానికి మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఆదేశించింది.. రామనాథపురం జిల్లా పసుంపొన్ గ్రామంలో షేర్ ఆటో, పోలీసు వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. దీనిపై కముది పోలీసులు జరిపిన విచారణలో షేర్ ఆటో డ్రైవర్ చల్ల పాండియన్ మద్యం సేవించి వేగంగా ఆటో నడిపినందువల్ల ఈ ప్రమాదం జరిగినట్టు తెలిసింది. ఈ కేసుపై విచారణ జరిపిన రామనాథపురం న్యాయస్థానం చల్లపాండియన్‌కు రెండేళ్ళు జైలుశిక్ష విధించింది. జైలుశిక్షను రద్దు చేయాలని కోరుతూ చల్ల పాండియన్ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి రామకృష్ణన్... ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే షేర్ ఆటోలవల్ల ఏర్పడే సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రమాదకరంగా నడిపే షేర్ ఆటోల పర్మిట్‌లను రద్దు చేయాలని, ఎక్కువ మంది ప్రయాణికులతో నడిపే షేర్‌ఆటోలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు చేపట్టేందుకు అనుగుణంగా మోటారు వాహనచట్టంలో అవసరమైన సవరణలు చేపట్టి, నివేదిక దాఖలు చేయాల్సిందిగా రాష్ట్ర రవాణాశాఖ కార్యదర్శికి ఉత్తర్వులు జారీచేశారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ

● హిజ్రా పోగొట్టుకున్న నగల అప్పగింత




హిజ్రా సమంతకు నగలు అప్పగిస్తున్న ఆంధ్రూ

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): హిజ్రా పోగొట్టుకున్న నగలను ఆమెకు అందజేసిన ఆటోడ్రైవర్ నిజాయితీని పోలీసులు సహా పలువురు అభినందించారు. నాగర్‌కోయిల్‌కు చెందిన హిజ్రా సమంత శుక్రవారం బజార్ వెళ్తుండగా, ఆమె బ్యాగు ఎక్కడో పడిపోయింది. రోడ్డు పక్కన బ్యాగు పడి ఉండడాన్ని గుర్తించిన ఆటో డ్రైవర్ అందులో చూడగా 20 సవర్ల నగలు, సెల్‌ఫోన్ తదితరాలు గుర్తించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు విచారణ చేపట్టి, హిజ్రా సమంత పోగొట్టుకున్న బ్యాగు ఇదేనని గుర్తించి, ఆమెను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బ్యాగు అప్పగించారు. ఆటో డ్రైవర్ నిజాయితీని పోలీసులు అభినందించారు.

వైభవంగా గంగమ్మ జాతర

వేలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా సత్తువాచారిలోని సాలై గంగమ్మ జాతర వైభవంగా జరిగాయి. శనివారం ఉదయం గర్భాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజల అనం తరం, అలకరించిన వాహనంలో పురవీధుల్లో శిరస్సు ఊరేగించారు. అనంతరం భక్తులు అమ్మవారికి అంబలి సమర్పించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త వేలు, అధ్యక్షుడు బాబు, సెక్రటరీ అరివయగన్, కోశాధికారి తంగం తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షంచారు.

ఖైదీ కుమార్తెకు ఆర్థికసాయం



వేలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): వేలూరు సెంట్రల్ జైలులో మురుగన్ అనే వ్యక్తి యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నాడు. ఇటీవల విడుదలైన ప్లస్‌టూ ఫలితాల్లో అతని కుమార్తె మధుమిత ఉత్తీర్ణత సాధించింది. తన బాగోగులు చూసుకోవడానికి తన తండ్రిని విడుదల చేయాలని అతని కుమార్తె పిటిషన్ దాఖలు చేసింది. ఈ విషయంపై వేలూరు కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో, ప్లస్‌టూలో మధుమిత ఉత్తీర్ణత సాధించిందనే విషయం తెలిసిన జైలు అధికారులు విద్యార్థిని బీకామ్ చదువుకునేందుకు వేలూరులోని ఆక్సీలియం కళాశాలలో చేర్పించి రూ.11వేల ఫీజు కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఐజీ షణ్ముగం, ఎస్పీ ధర్మరాజ్, జైలు అధికారులు పాల్గొన్నారు.

నూతన సొబగులతో సిద్ధమవుతున్న

వల్లువర్‌కోట్టం

ఈ నెలాఖరులో సందర్శకులకు అనుమతి!


ప్రవేశ ద్వారం ముందు గంభీరంగా సింహం


వల్లువర్‌కోట్టం



SUNDAY SPECIAL


రథానికి తుది మెరుగులు

వాషర్‌మెన్ పేట, మే 24 (ఆంధ్రజ్యోతి): నూతన సొబగులతో సిద్ధమవుతున్న వల్లువర్‌కోట్టం ఈ నెలాఖరులో ప్రజా సందర్శనానికి సన్నద్ధమవుతోంది. వల్లువర్‌కోట్టంకు మెరుగులు దిద్దే పనులను రూ.80 కోట్లతో గత ఏడాది జనవరిలో ప్రభుత్వం ప్రారంభించింది. వల్లువర్‌కోట్టంను సాంస్కృతిక కళా కేంద్రంగా తీర్చి దిద్దడమే ఈ పునరుద్ధరణ పనుల ప్రధాన లక్ష్యం. తమిళుల ఆరాధ్య కవి తిరువళ్లువర్ ఘనతను ప్రపంచానికి చాటి చెప్పాలన్న ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి 1973వ సంవత్సరాన వల్లువర్‌కోట్టంకు శ్రీకారం చుట్టారు. దీని నిర్మాణ బాధ్యతలను ప్రముఖ శిల్పకారుడు గణపతి స్తపతి(దివంగత) చేపట్టడం విశేషం. సుమారు మూడేళ్లపాటు శ్రమించి, 1976లో దీని నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇక్కడ ఉన్న రాతితో చెక్కబడిన రథం తమిళనాట ప్రసిద్ధి చెందిన 'తిరువారూర్ తేరు'కు ప్రతీక.

మరింత విస్తరణ... : కాగా ఇప్పుడు పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఈ వేదిక సామర్థ్యాన్ని పెంచి, ఒకే సమయంలో 1,600 మంది కూర్చునేలా ఏర్పాటు చేశారు. అంతేగాక ఈ సభామందిరానికి పూర్తి ఏసీ వసతి కల్పించారు. దీనిని సుందరంగా తీర్చిదిద్దే పనులలో మొత్తం 270 మంది కార్మికులు, నిపుణులు నిమగ్నమయ్యారు. పునరుద్ధరణ పనుల విషయమై ప్రాజెక్టు డైరెక్టర్ దీపక్ మాట్లాడుతూ.. స్తంభాలకు, శిల్పాల పనులు పూర్తి దశకు చేరుకున్నాయని వెల్లడించారు. 110 అడుగుల రథం చుట్టూ రంగు రంగుల విద్యుద్దీపాలంకరణ, సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటుందని చెప్పారు. ఈ స్మారకమందిరానికి ఉన్న సాంస్కృతిక ప్రత్యేకతను పరిరక్షిస్తూ వాటికి నూతన సొబగులు అద్దినట్టు తెలిపారు. దీని ప్రాంగణంలో కాంతులీనే విద్యుద్దీపాలతో కూడుకున్న ఫౌంటైన్లను ఏర్పాటు చేశామని, నీటి కదలికలకు తగ్గట్టు సంగీతం ఉంటుందన్నారు. ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన కేఫిటేరియాలోని గోడలపై వేసిన తిరువళ్లువర్ కుడ్యచిత్రాలు ఆకట్టుకుంటాయన్నారు.

తిరువారూర్ ఆలయ రథాన్ని నమూనాగా తీసుకుని రాతితో చెక్కారు. 128 అడుగుల ఎత్తు కలిగిన రథాన్ని 7 అడుగుల ఎత్తు గల రెండు ఏనుగులు లాగుతున్న రీతిలో అద్భుత కళాఖండంగా తీర్చిదిద్దారు. ఈ రథం పైభాగంలో తిరువళ్లువర్ శిలా విగ్రహాన్ని స్థాపించారు. విగ్రహం చుట్టూ ఉన్న స్తంభాలు ద్రవిడ వాస్తు శిల్ప శాస్త్రాన్ని ఆధారంగా చేసుకుని నిర్మించారు. దీని ప్రాంగణంలో వళ్లువర్ రచించిన 1330 సూక్తులను విడివిడిగా నల్లరాతి ఫలకాలపై చెక్కారు. ఇందులో ఉన్న మరో ముఖ్యమైన నిర్మాణం సభా మందిరం. నిర్మాణ సమయంలో ఇది 220 అడుగుల పొడవు, 100 అడుగుల వెడల్పుతో ఏకకాలంలో 400 మంది కూర్చునే విధంగా నిర్మించారు. ఈ సభా మందిరం ఎన్నో గుర్తింపదగ్గ ప్రభుత్వ ప్రైవేటు కార్యక్రమాల నిర్వహణకు వేదికగా నిలిచింది.


మరింత నిగనిగలాడుతున్న గజరాజులు


రంగులద్దుకుంటున్న గోడలు





'వెన్నిరాడై' మూర్తి సినీ కెరీర్‌కు ఆరు పదులు


వెన్నిరాడై మూర్తి

తమిళ చిత్రపరిశ్రమలో 50 వసంతాలు పూర్తి చేసుకున్న నటుల్లో ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. ఆ వరుసలో అగ్రహీరో కమల్ హాసన్ ఉంటే, సూపర్‌స్టార్ రజనీకాంత్ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు చేరువయ్యారు. అయితే, వెటర్న్ నటుల్లో వెన్నిర ఆడై మూర్తి (వెన్నిరాడై మూర్తి) చిత్ర పరిశ్రమలో 60 ఏళ్ళు విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఆయన నటించిన తొలి చిత్రం 1965లో విడుదలైంది. 89 ఏళ్ల మూర్తి.. గత కొంతకాలంగా సినిమాల్లో నటించడం మానేసి ఇంటిపట్టునే విశ్రాంతి తీసుకుంటున్నారు. తమిళం, తెలుగు, మలయాళం తదితర భాషల్లో 620కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన... తన 60 యేళ్ళ సినీ ప్రయాణంపై తాజాగా స్పందించారు. 'నేను సంతృప్తిగా ఉన్నాను. ఇంతకాలం పాటు నన్ను అభిమానించిన సినీ ప్రేక్షకులకు, అభిమానులకు, చేరదీసి ఆదరించిన సినీ ప్రముఖులకు ధన్యవాదాలు' తెలిపారు. ఇటీవలికాలంలో ఆయన సినీ ఫంక్షన్లకు కూడా దూరంగా ఉంటున్నారు. తమ ఒక్కగానొక్క కుమారుడు అమెరికాలో ఉండటంతో అప్పుడప్పుడూ ఆయన చెన్నై టూ అమెరికా వెళ్ళి వస్తుంటారు.

యువ దర్శకుల్లో ప్రతిభ పుష్కలం

● ప్రభు


'రాజపుత్తిరన్'లో ప్రభు, వెట్రి

చిత్రపరిశ్రమలోకి అడుగుపెడుతున్న యువ దర్శకుల్లో ప్రతిభాపాటవాలు పుష్కలంగా ఉన్నాయని సీనియర్ నటుడు ప్రభు కొనియాడారు. 'ఇళయ తిలగం' ప్రభు, వెట్రి, కృష్ణ ప్రియ, మన్సూర్ అలీఖాన్, ఆర్వీ ఉదయకుమార్, తంగదురై, ఇమాన్ అన్నాచ్చి, లివింగ్‌స్టన్, కోమల్ కుమార్ తదితరులు నటించిన 'రాజపుత్తిరన్' చిత్రం ఈ నెల 30వ తేదీ విడుదలకానుంది. దీంతో శుక్రవారం రాత్రి నగరంలో చిత్ర ఆడియో రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. మహా కందన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేఎం షఫీ 'క్రిస్కెంట్ సినీ క్రియేషన్స్' పతాకంపై నిర్మించారు. శక్తి ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత బి.శక్తివేలన్ రిలీజ్ చేస్తున్నారు. చిత్ర ఆడియో రిలీజ్ వేడుకలో చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఇందులో ప్రభు మాట్లాడుతూ 'ఇప్పటివరకు 74 మంది కొత్త దర్శకులతో కలిసి పనిచేశాను. ఇప్పటికీ నటిస్తున్నాను. ఈ మూవీలో వెట్రికి తండ్రిగా నటించాను. అనేక మంది యువ నటీనటులు నటించారు. వారితో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఒక పాటకు డ్యాన్స్ చేయనని మొండికేస్తే.. పట్టుబట్టిమరీ డ్యాన్స్ చేయించారు. ఈ పాట టి.రాజేందర్ నేపథ్యగానం చేశారు. ఇందులో కృష్ణ ప్రియ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమా షూటింగ్ రామనాథపురం జిల్లా సాయల్‌కుడిలో జరిగింది. ఆ గ్రామ ప్రజలు ఎంతో ఆప్యాయత చూపించారు. నన్ను హీరోగా సినిమా తీసిన దర్శకుడు ఆర్వి ఉదయకుమార్, జీఎం.కుమార్ ఈ మూవీలో కలిసి నటించారు. దర్శకుడు మహా కందన్ మాట్లాడుతూ, 'ఈ స్టోరీ గ్రామీణ నేపథ్యంలో తండ్రీకొడుకుల మధ్య సాగే ఫ్యామిలీ, యాక్షన్, ఎంటర్‌టైన్మెంట్ స్టోరీ. నేటి తరం యువతరంతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించాం. మీడియా కూడా సపోర్టు కోరుతున్నాం' అన్నారు.

హీరోగా మారిన నిర్మాత

కేజేఆర్ స్టూడియోస్ అధినేత, నిర్మాత కేజేఆర్ రాజేష్ తాజాగా హీరో అవతారమెత్తారు. ఆయన కథానాయకుడిగా నటించే చిత్రానికి 'అంగీకారం' అనే టైటిల్ ఖరారు చేశారు. గతంలో 'డాక్టర్, 'అయలాన్' వంటి చిత్రాల్లో నటించిన కేజేఆర్ రాజేష్.. ఇపుడు తెన్‌పాదియన్ దర్శకత్వంలో హీరోగా వెండితెరకు పరిచయమవుతున్నారు. స్వస్తిక్ విజన్స్ పతాకంపై ప్రశాంత్, అజిత్ భాస్కర్, అరుణ్ మురుగన్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సింధూరి విశ్వనాథ్, విజీ వెంకటేష్, ఆంటోని, రంగరాజ్ పాండే, మన్సూర్ అలీఖాన్, మోహన్ రామ్ తదితరులు నటిస్తున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'దక్షిణ చెన్నైలోని మాట్టాన్‌కుప్పం అనే ప్రాంతంలో జరిగే కథ. ఒకపుడు ఇక్కడ అనేక మంది క్రీడాకారులు ఉండేవారు. ఇపుడు క్రీడా పోటీలకు ఆ ప్రాంతం దూరమైపోయింది. అలాంటి ప్రాంతానికి చెందిన ఒక అథ్లెట్ జాతీయ స్థాయిలో రాణించేందుకు ఎదుర్కొనే సవాళ్ళు, కష్టనష్టాలను అనేక వాస్తవిక అంశాలను నేపథ్యంగా తీసుకుని రూపొందిస్తున్నాం. ప్రస్తుతం చివరి దశ చిత్రీకరణ పనులు జరుపుకుంటుంది' అన్నారు.


'అంగీకారం'లో కేజేఆర్ రాజేష్

చిత్రజ్యోతి

ప్లీజ్.. ఆ వీడియో డౌన్‌లోడ్ చెయ్యొద్దు

● కిరణ్ రాథోడ్



కోలీవుడ్‌లో ప్రముఖ నటిగా గుర్తింపు పొందిన కిరణ్ రాథోడ్ ఇపుడు పెద్ద సమస్యలో చిక్కుకున్నారు. ఆమెకు సంబంధించిన మార్ఫింగ్ న్యూడ్ వీడియో ఒకటి ఇపుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీంతో ఆ వీడియోను ఎవరూ డౌన్‌లోడ్ చేయొద్దని అభిమానులకు, నెటిజన్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. మార్ఫింగ్ ద్వారా క్రియేట్ చేసిన నగ్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోందని, దీన్ని ఎవరూ డౌన్‌లోడ్ లేదా షేర్ చేయడం చేయొద్దని కోరారు. కాగా, గతంలో కమల్ హాసన్, విక్రమ్, అజిత్ వంటి అగ్రహీరోల చిత్రాల్లో నటించిన కిరణ్ రాథోడ్.. తెలుగు, హిందీ చిత్రాలు, ఆల్బమ్స్‌లో కూడా నటించారు.

విరిసిన కుసుమం ప్రకృతి రమణీయం

● కొడైకెనాల్‌లో 62వ పుష్ప ప్రదర్శన ప్రారంభం


పూలతో రూపొందించిన పాండా


కొండ వెల్లుల్లి నమూనా ముందు పర్యాటకులు

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కొడైకెనాల్ బ్రయాండ్ పార్క్‌లో 62వ పుష్ప ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. పర్యాటక శాఖ, వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ప్రదర్శన జూన్ 1వ తేది వరకు కొనసాగుతుంది. ఈ ప్రదర్శనలో సాల్వియా, పింక్ ఆస్టర్, డాల్గియా సహా 22 రకాలకు చెందిన 2 లక్షల పూలున్నాయి. ప్రదర్శనలో ప్రత్యేక అంశంగా సుమారు లక్ష కార్నేషన్ పూలతో దిండుగల్ లాక్, కొడైకెనాల్ మౌంటైన్ పెప్పర్, అయకుడి జామ, పిల్లి, నెమలి, ఏనుగు, ఐదు రంగుల్లో చిలుక, పాండా, ఎలుగుబంటి తదితర నమూనాలు ఏర్పాటుచేశారు. తొలిరోజు పెద్దసంఖ్యలో పాల్గొన్న పర్యాటకులు, పూలతో చేసిన ఆకృతుల వద్ద సెల్ఫీ దిగుతూ సందడి చేశారు. ప్రదర్శనలో భాగంగా కళాశాల, పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. వేసవి ఉత్సవాల సందర్భంగా పడవ పోటీ, చేపలు పట్టే పోటీలు, డాగ్ షో తదితరాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. కాగా, ప్రదర్శన జరిగే 9 రోజులు ప్రవేశ రుసుము రెట్టింపు చేయడంపై పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


దిండుగల్ లాక్


ప్రదర్శనలో పండ్లు, పూలతో రూపొందించిన వినాయకుడు




సెల్ఫీ పాయింట్ - కార్నేశన్ పూలతో రూపొందించిన నెమలి


ఉడుత, పక్షి

తిరువొత్తియూర్‌లో రూ.272 కోట్లతో ఫిషింగ్ హార్బర్

● 28న ప్రారంభించనున్న సీఎం స్టాలిన్


పోర్టు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రులు అనితా రాధాకృష్ణన్, పీకే శేఖర్‌బాబు తదితరులు

పెరంబూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్‌లో నిర్మించిన ఫిషింగ్ పోర్టును ఈ నెల 28న ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. కాశిమేడు ఫిషింగ్ హార్బర్ పరిధిలోని ఎన్నూర్ నుంచి కాశిమేడు వరకు తీర ప్రాంతాల జాలర్లు మోటారు, ఫైబర్ పడవల్లో చేపట వేటకు సముద్రంలోకి వెళుతుంటారు. చేపల వేటకు వినియోగించే సుమారు 1,500లకు పైగా పడవలు కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో లంగరు వేసి ఉంచుతారు. ఈ ప్రాంతంలో స్థలం తక్కువగా ఉండడంతో తిరువొత్తియూర్ కుప్పంలో సూరై ఫిషింగ్ హార్బర్‌ను రూ.272.20 కోట్లతో నిర్మించే పనులు 2019లో ప్రారంభమయ్యాయి. ఈ ఓడరేవులో 400 నెట్ పడవలు, 250 ఫైబర్ పడవలు రద్దీ లేకుండా నిలుపే సామర్థ్యం కలిగి ఉంది. అలాగే, చేపల వేలం హాల్, పడవల మరమ్మతు కేంద్రం, టెలికమ్యూనికేషన్ గది, విశ్రాంతి గది, రెస్టారెంట్ తదితర వసతులు ఏర్పాటుచేశారు. ఈ మినీ హార్బర్‌లో 60వేల టన్నుల చేపలు ఉంచే సామర్థ్యం కలిగి ఉంది. దీంతో చేపల విక్రయాలు, ఎగుమతులు పెరిగే అవకాశంతో పాటు ఫిషింగ్ హార్బర్‌లో సుమారు 3 వేల మందికి ఉపాధి అవకాశాలు కలిగే అవకాశముంది. ఈ హార్బర్‌ను శనివారం మత్స్య, జాలర్ల సంక్షేమ శాఖ మంత్రి అనితా రాధాకృష్ణన్, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ఎమ్మెల్యేలు మాధవరం సుదర్శనం, కేపీ శంకర్, మండల కమిటీ అధ్యక్షులు తనిఅరసు, ఏవీ ఆర్ముగం, మత్స్యశాఖ అధికారులు పరిశీలించారు.


చెన్నై షేనాయ్ నగర్‌లోని అన్నానగర్ మండల కార్యాలయంలో రూ.32 లక్షలతో అధునాతనంగా నిర్మించిన పిల్లల సంరక్షణా కేంద్రాన్ని శనివారం ప్రారంభిస్తున్న చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, అన్నానగర్ ఎమ్మెల్యే ఎంకే మోహన్ తదితరులు